గ్రామాల్లో కుండపోత వర్షం



కేశంపేట: నీట మునిగిన పంట పొలాలు

- రోడ్లన్నీ జలమయం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు దాదాపు రెండు గంటల వరకు భారీ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు వచ్చాయి. దీంతో గ్రామాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లల్లో భారీగా వర్షం నీరు చేరడంతో వాహనాదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలో గల ఉడిపి హోటల్ ముందు జాతీయ రహదారిపై, అమ్డాపూర్ రక్తమైసమ్మ దేవాలయం సమీపంలో రహదారిపై వచ్చిన భారీ వర్షానికి నీరు చేరడంతో వాహనాదారులు ఇబ్బందులకు గురయ్యారు. హిమాయత్‌నగర్ గ్రామంలో చిలుకూరు బాలాజీకి వెళ్లే రహదారిపై వర్షం నీరు చేరడం మూలాన వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. రహదారులపై వర్షపు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, వాహనాదారులు అధికారులను కోరుతున్నారు.

నీటమునిగిన పంట పొలాలు..

కేశంపేట: మండల పరిధిలో శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. బోధునంపల్లి గ్రామ శివారులో ఇటీవల కల్వర్టును నిర్మించారు. ఈ కల్వర్టును నాసిరకంగా నిర్మించారని స్థానికులు వాపోయారు. దీంతో ఈ కల్వర్టు నీటి ప్రవాహాన్ని తట్టుకునే విధంగా లేకపోవడంతో వర్షపునీరు సమీపంలోని పంట పొలాల్లోకి చేరడంతో అవి పూర్తిగా నీట మునిగాయి. కల్వర్టు నిర్మించేటప్పుడు సమీపంలోని రైతులు అధికారులకు ఈ విషయం గురించి వివరించినా పట్టించుకోలేదన్నారు.

107 మి.మీ వర్షాపాతం నమోదు...

శనివారం రాత్రి నుంచి 107.8మీ.మీ వర్షాపాతం నమోదైనట్లు ఎంపీహెచ్ఓ కల్యాణి తెలిపారు. సంగెం రేంజ్ పరిధిలో 32.5 మీ.మీ, కేశంపేటలో 144.3మీమీ, తొమ్మిదిరేకుల పరిధిలో 107.8మీమీ చొప్పున్న వర్షాపాతం నమోదైనట్లు ఆమె తెలిపారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్‌లో: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు పరిస్థితి దయనీయంగా మారింది. ఆసుపత్రి ప్రధాన గేటు ముందు రోడ్డంతా చిత్తడిచిత్తడయ్యింది. ఆసుపత్రి ముందు నుంచి అమీర్‌గూడ వెళ్లే రోడ్డు గుంతలయమంగా మారడంతో వర్షం పడినప్పుడల్లా నీరు నిలిచి చిత్తడిగా తయారువుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రి ముందు చిత్తడి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈసీ వాగులో వరద..

ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి ఈసీ వాగులో వరద వచ్చి చేరింది. మొయినాబాద్ మండలంతో పాటు ఎగువ ప్రాంతాలైన చేవెళ్ల, షాబాద్ తదితర మండలాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం పడింది. దీంతో ఈసీ వాగు వెంకటాపూర్, అమ్డాపూర్ గ్రామాల వద్ద నిండుగా ప్రవహించింది.

నేలకూలిన స్తంభాలు..

షాద్‌నగర్: మధురాపూర్, పీర్లగూడ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలాయి. పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం ఉదయం విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు.



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో వర్షపు నీటిలో ఇరుక్కున్న కారు



మధురాపూర్‌లో నేలకూలిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్



మొయినాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట చిత్తడిగా మారిన రోడ్డు

దైవచింతనతో మానసిక ప్రశాంతత



పూజలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎంపీపీ తదితరులు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఆదివారం తిమ్మాపూర్ చౌరస్తా కాలనీలో నూతంగా నిర్మించిన కనకదుర్గ ఆలయ పూజలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మించిన 3వ వార్డు కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్‌ను అభినందించారు. దైవచింతన కలిగిన వారు ఎల్లప్పుడు తోటి వారికి సహాయం చేయాలనే గుణాన్ని కలిగి ఉంటారన్నారు. ప్రతీ ఒక్కరు ఆలయాలకు వెళ్లడంతో పూజలు, భక్తి కార్యక్రమాల్లో పాల్గొనే మనఃస్థత్వాన్ని కలిగి ఉంటారన్నారు. దీంతో మనిషిలో ఉన్న ఒత్తిడి దూరమైతాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతో పాటు పలువురి నాయకులను శాలువా కప్పి సన్మానించారు. జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, విఠల్, డోలీ రవీందర్, మహేశ్‌గౌడ్, రవితనాయక్, నరేందర్‌రెడ్డి, దర్శన్, ప్రమోద్‌గౌడ్, పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి


కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: యువత అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఆమనగల్లులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు మానయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నాయకులు అనిల్‌గౌడ్, రాజశేఖర్, శ్రీరాములు, మైసయ్య, జంగయ్య, అలీం, కృష్ణ, శ్రీదర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు

పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు

కడ్తాల్: రానున్న ఎన్నికల్లో పద్మశాలీలకు జనాభా ప్రతిపాధికన ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో పద్మశాలీ శంఖారావం సభ నేపథ్యంలో ఆదివారం కడ్తాల్‌లో పద్మశాలి సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తూరు: కొత్తూరు పట్టణంలో గత నెల 29న విద్యుదాఘాతంతో మృతి చెందిన ప్లంబర్ పవన్‌కుమార్ కుటుంబానికి ఇంటి యాజమాని ఆదివారం రూ. 2.50 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం గురుకుంట గ్రామానికి చెందిన పవన్‌కుమార్(23) గతకొన్నేళ్ల నుంచి కొత్తూరు పట్టణంలో నివాసం ఉంటూ ప్లంబర్‌గా పనిచేసుకుంటున్నాడు. గత నెల 29న పట్టణంలోని నారాయణగూడ కాలనీలో ఓ ఇంటిపై నీటి ట్యాంకును బిగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురైనట్లు వివరించారు. కుటుంబ సభ్యులు ఉస్మానియాకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ విషయం గురించి ఇంటి యాజమానితో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం చేయడానికి ఒప్పించారు. అంతే కాకుండా విద్యుత్‌శాఖ నుంచి కూడా బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

షాద్‌నగర్‌రూరల్: కిషన్‌నగర్ గ్రామానికి చెందిన చాకలివెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లిశంకర్ ఆదివారం మృతదేహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లిశంకర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబానికి అనేక కష్టాలు ఎదురవుతాయన్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని, తన వంతు సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారం సుదర్శన్, మల్లారెడ్డి, బుచ్చయ్య, శ్రీశైలం, రాజ్‌కుమార్, శ్రీశైలం, ఎర్రరాంరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి చేయాలి



మండల, యూత్ కమిటీలతో ముదిరాజ్ సంఘం నాయకులు

సంఘం మండల అధ్యక్షుడు ఉరడి నర్సింహులు

చేవెళ్ల: ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషిచేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఉరడి నర్సింహులు అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాకు తగిన విధంగా రాజకీయ అవకాశాలు రావడం లేదని దీనిపై ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడాలన్నారు. అనంతరం మండల సంఘం, యూత్‌కమిటీలను వారు ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ఊరేళ్ల గ్రామానికి చెందిన ఉరడి నర్సింలు, ఉపాధ్యక్షులుగా సునుగంటి శ్రీకాంత్ (మల్కాపూర్), బి గణేశ్(గుండాల), కె. వెంకటేశ్‌బాబు(అంతారం), బి. గోపాల్(కమ్మెట), ఉరడి వెంకటేశ్(ముడిమ్యాల), ప్రధానకార్యదర్శులుగా తెలుగు రాజశేఖర్(దామరగిద్ద), ఉరడి రాంప్రకాశ్(ఊరేళ్ల), కె. బాబు(పామెన), సీహెచ్ శివరాజ్(మల్కాపూర్), కోశాధికారులుగా ఎం. గోపాల్(మీర్జాగూడ), కె. శ్రీనివాస్(గుండాల), ప్రచార కార్యదర్శిగా తెలుగు వెంకటేశ్(పామెన)లను, సభ్యులుగా ఎం. ప్రభు, యు. నర్సింలు, క్రిష్ణ, హన్మంత్ తదితరులను ఎంపిక చేశారన్నారు. యూత్‌కమిటీలో అధ్యక్షుడిగా తెలుగు శ్రీనివాస్(చేవెళ్ల), ఉపాధ్యక్షులుగా తెలుగు నవిన్(అంతారం), టి. క్రిష్ణమోహన్, వెంకటేశ్(పామెన), సీహెచ్ యాదగిరి(మల్కాపూర్), కె. వెంకటేశ్(గుండాల), ప్రధాన కార్యదర్శులుగా అనిల్, మహేశ్, రాజశేఖర్, జనార్దన్, శివకుమార్, తదితరులను ఎంపిక చేశారన్నారు. ఈ కమిటీలు ముదిరాజ్‌ల ఐక్యత కోసం కృషి చేయాలన్నారు.

బీసీల అభివృద్ధికి నిరంతరం కృషి



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ పీసరి అనితారెడ్డి, పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి

- సర్పంచ్ పీసరి అనితారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి
- రూ.10 లక్షలతో బీసీ భవన్ నిర్మాణానికి భూమి పూజ

షాబాద్: బీసీల అభివృద్ధికి నిరంతరం తమ వంతు కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ పీసరి అనితారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో సొంత ఖర్చులతో రూ.10 లక్షలతో బీసీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. బీసీ భవనానికి సొంతంగా భూమి, రూ.10 లక్షల నిధులు కేటాయించిన్నట్లు తెలిపారు. బీసీల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. ఏట్ల ఎర్రవల్లి గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాం పూర్తి చేసిన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

శంకర్‌పల్లి: బాల్యవివాహం జరుగుతుందనే సమాచారంతో చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. చైల్డ్‌హెల్ప్‌లైన్ ఇన్‌చార్జి సంతోష తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలంలోని మహబూలింగాపురం గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్లో 17 సంవత్సరాల బాలికకు వివాహం జరుగుతుందనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఆమె షీటీమ్ ఏఎస్ఐ సంపత్‌కుమార్, శంకర్‌పల్లి ఎస్ఐ సత్యనారాయణలతో విచారణ నిర్వహించారు. ఈ విచారణలో మైనర్ అని నిర్ధారించుకున్న తరువాత బాలిక వివాహాన్ని అధికారులు నిలిపివేశారు. అనంతరం వారు తల్లిదండ్రులకు వధూవరులకు కౌన్సింగ్ ఇచ్చారు. బాలికకు మైనార్టీ తీరిన తరువాత వివాహం చేయాలని అధికారులు తల్లిదండ్రులకు సూచించారు. కాదని మళ్లీ వివాహం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అమ్డాపూర్ పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడలు


జోనల్ కార్యదర్శి బాలస్వామిరెడ్డి



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో రాజేంద్రనగర్ జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు జోనల్ క్రీడల కార్యదర్శి బాలస్వామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తేదీన 14–17 సంవత్సరాల బాలబాలికలకు ఖో-ఖో టోర్నమెంట్ నిర్వహిస్తారన్నారు. రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్, మొయినాబాద్ మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారి బోనఫైడ్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. మరింత సమచారం కోసం 9866706457లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి

టీటీడీ బోర్డు అడ్వైజర్ కమిటీ మెంబర్ కేసారం ప్రతాప్‌రెడ్డి



చేవెళ్ల: వైఎస్సార్ సేవలు మరువలేనివని ఆయన అభిమానులు, కార్యకర్తలు తెలంగాణలో ఎంతో మంది ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు, టీటీడీ బోర్డు తెలంగాణ అడ్వైజర్ కమిటీ మెంబర్ కేసారం ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభిమానులతో త్వరలో ఒక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఏ రాజకీయపార్టీకి అనుకులంగా ఉండాలనే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశం తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య నాయకులను ఆహ్వానిస్తామన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్



విజయ్‌రాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న షాబాద్ దర్శన్

మొయినాబాద్: మూడు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ధీమా వ్యక్తం చేశారు. నాగిరెడ్డిగూడ గ్రామంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే మూడు నెలలు అధికారమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎర్ర విజయ్‌రాజ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేందర్‌లను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మహేందర్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, అనంతరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్, జైపాల్‌రెడ్డి, భిక్షపతి, రాజుగౌడ్, సంజీవ, సుధాకర్, సుకుమార్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, అశోక్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్



రంజిత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ

టీటీడీ బోర్డు సభ్యురాలు సీత

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను నంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ నిలిపారని టీటీడీ బోర్డు సభ్యురాలు సీత పేర్కొన్నారు. గడ్డం సీత ప్రమాణ స్వీకారం అనంతరం హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా ఆమెను సన్మానించారు. ఆదివారం నగరంలోని ఆమె నివాసంలో సీతతో పాటు ఆమె భర్త ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి దంపతులను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ, మొయినాబాద్ మండల ఎంపీపీ నక్షత్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్దార్‌నగర్‌మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జీవంతు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గడ్డం సీతారంజిత్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బీఆర్ఎస్ అభివృద్ధికి అందరం కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల నాయకులు మత్స్యకార రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటాపూర్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రికి స్వాగతం పలికిన చైర్మన్



స్వాగతం పలుకుతున్న రాజావరప్రసాద్

షాద్‌నగర్: అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన మంత్రి నిరంజన్‌రెడ్డికి ఆదివారం ఉదయం శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టులో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నేత పినబాక ప్రభాకర్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



సంగెం గ్రామంలో పోలింగ్‌బూత్‌ను పరిశీలించిన తహసీల్దార్ అజీంఅలీ

కేశంపేట: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునఃరీక్షణలో భాగంగా ఆదివారం తహసీల్దార్ అజీంఅలీ పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించి బీఎల్ఓలకు సలహాలు, సూచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వరూప

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లచ్చంపేట గ్రామంలో ఆదివారం జెడ్పీటీసీ బంగారు స్వరూప సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో రూ.10 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. ఈ రోడ్డును గ్రామంలోని బుచ్చయ్య ఇంటి నుంచి బస్‌స్టాప్ వరకు 250 మీటర్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు రాములు, గోపాల్, బుచ్చయ్య, బాల్‌రాజ్, కృష్ణయ్య, నర్సింలు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



వనంపల్లిలో బోనాల్లో పాల్గొన్న సర్పంచ్ కవిత

కొందుర్గు: వనంపల్లి గ్రామంలో ఆదివారం మల్లన్నస్వామి బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు చారిటబుల్ ట్రస్టు అధినేత సహకారంతో లయన్స్‌క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ అధ్యక్షుడు డాక్టర్ నాగవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని నవోదయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సేవాదృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధికి భాగస్వాములు కావాలన్నారు. మనం ఎంత సంపాదించామనే ధోరణి కాకుండా, ఇతరులకు ఎంత సేవ చేశామనేది ముఖ్యమన్నారు. జీవితంలో ఎంత సంపాదించినా కలగని సంతృప్తి పేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం లభిస్తుందన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి మల్చాలంమురళీ, సీనియర్ సభ్యులు సాయికృష్ణ, నారాయణ, ఇస్నాతి శ్రీనివాస్, మేడిగ పెంటయ్య, శ్రీశైలం, భాస్కరాచారి, ఆకుల ప్రదీప్, మోహన్‌సింగ్, సుధాకర్ అప్ప తదితరులు పాల్గొన్నారు.